క్లుప్తంగా

శ్రీనివాసునికి వైభవంగా పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: నగరంలోని తోటపాలెం బాలాజీనగర్‌లో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిహారం రంగాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష హోమాలు, ధ్వజారోహణం తదితర పూజాధికాలు చేశారు. కమిటీ ప్రతినిధులు, దాతలు, భక్తుల సహకారంతో తిరుపవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీఎస్ సూర్యభగవాన్ తెలిపారు. కార్యక్రమంలో రుత్వికులు రాధాకృష్ణమాచార్యులు, భాస్కరాచార్యులు, కమిటీ కార్యదర్శి కేవీ రమణాజీ, భీమ్‌సింగ్, ఉమాశంకర్, ఎన్.శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పనిచేయాలి



కుమారస్వామిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఏఆర్ ఎస్ఐగా పని చేస్తున్న వేముల కుమారస్వామి ఆర్ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. కుమారస్వామికి ఎస్పీ స్వయంగా స్టార్స్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ కావడంతో అక్కడ మరింత సమర్థవంతంగా పనిచేసి పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలని ఎస్పీ సూచించారు. ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, భగవాన్ తదితరులు కుమారస్వామిని అభినందించారు.

కార్పొరేషన్ అధికారుల బదిలీ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కీలకమైన టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటివరకు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన కప్పల శ్రీనివాసరావు విశాఖ జిల్లా పబ్లిక్ హెల్త్ విభాగం డిప్యూటీ ఎస్ఈగా బదిలీపై వెళ్లనున్నారు. ఆయన స్థానంలో పబ్లిక్ హెల్త్ విభాగంలో ఇన్‌ఛార్జి ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న టి.రాయలబాబు బాధ్యతలు చేపట్టనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్లుగా విధులు నిర్వహించిన మధుసూదనరావును విశాఖ జిల్లా జీవీఎంసీకి బదిలీ చేయగా, మరో ఏసీపీ అమ్మాజీరావును వీఎంఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. వారి స్థానంలో రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హరిబాబు, శ్రీకాకుళం నుంచి ఐవీ రమణమూర్తి రానున్నారు. అదేవిధంగా టీపీఓగా పలాస మున్సిపాలిటీ నుంచి ఎస్.అప్పలరాజును నియమించారు. ఇప్పటివరకు టీపీఎస్‌గా పనిచేసిన ఫిలిఫ్‌ను బొబ్బిలికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో జీవీఎంసీ నుంచి సిహెచ్.అనితను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నసమారాధన



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎక్సలెంట్ యూత్ ఆధ్వర్యంలో సుమారు 3వేల మందికి అన్న ప్రసాదాలు అందజేశారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఏటా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. గరివిడి మండలంలోని కుమరాం గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాల ద్వారానే జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందన్నారు. పిల్లలంతా మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టిసారించాలని సూచించారు.

అర్జీదారుల అవస్థలు



వినతులు అందించేందుకు పోటెత్తిన అర్జీదారులు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పెద్ద సంఖ్యలో ప్రజలు వినతులు అందించేందుకు వచ్చారు. అధికారుల అలసత్వం, వసతుల లేమి కారణంగా వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల కొద్దీ క్యూలో వేచి ఉండాల్సి రావడంతో దివ్యాంగులు చాలా ఇబ్బంది పడ్డారు.

– విజయనగరం



పింఛన్ కోసం దరఖాస్తు అందించేందుకు ఎస్.కోట నుంచి వచ్చిన దివ్యాంగులు జయసూర్య



ఆన్‌లైన్ వద్ద బారులు తీరిన అర్జీదారులు



వినతి ఇచ్చేందుకు ట్రైసైకిల్‌పై వచ్చిన దివ్యాంగుడు



అర్జీలను పరిశీలిస్తున్న అధికారి



వృద్ధురాలిని తీసుకుని వెళుతున్న మహిళ



పింఛన్ పెంపుపై వినతి అందించేందుకు దివ్యాంగురాలైన కుమార్తెతో కలిసి వచ్చిన ఓ తల్లి



పరిష్కార వేదిక ప్రవేశద్వారం వద్ద జనాలను అదుపు చేస్తున్న మహిళా పోలీసు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 వినతులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 వినతులు వచ్చాయి. కమిషనర్ పి.నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, పబ్లిక్ హెల్త్ విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చాయని తెలిపారు. వాటిని సంబంధిత విభాగాల అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఆర్ఓ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, మేనేజర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడమే లక్ష్యం



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: 'మన ఇల్లు మన గౌరవం' నినాదంతో శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా కృషి చేయాలని ఏఈలు, ఎమినిటీస్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. ఆయన ఛాంబర్‌లో సోమవారం ఏఈలు, ఎమినిటీస్ కార్యదర్శులతో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో గుంకలాం, కొండకరకాం ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28న లేఅవుట్ వద్ద పెద్ద ఎత్తున లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మార్చి 2025 నాటికి శతశాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు.

మురుగులో పైప్‌లైన్



డెంకాడ మండలం పెదతాడివాడ గ్రామంలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ వాల్వ్ మురుగునీటిలో దర్శనమిస్తోంది. వాల్వ్ ద్వారా మురుగునీరు పైపులైన్‌లోకి చేరి తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు తొలగించాలని, పైపులైన్ లీకేజీలు అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– విజయనగరం

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

లక్కవరపుకోట: అక్రమంగా మద్యం తరలిస్తున్న రంగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. మండలంలోని సంతోపేట గ్రామ సమీపంలోని లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఓ పూర్ణిమ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రతీ మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం సీతారామునిపేట, రామతీర్థం సచివాలయాల్లో, బుధవారం తంగుడుబిల్లి, సతివాడ రైతు సేవా కేంద్రాల వద్ద పొలంబడి జరుగుతుందని, రైతులు, గ్రామస్థాయి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 8 గంటలకు మండలంలోని సవరవిల్లి గ్రామంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది', 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి హరికృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులతో పాటు రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

15 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైమ్: జామి మండలం కుమరం గ్రామానికి చెందిన మీసాల రాంబాబు మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. అతని వద్ద 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట, బొప్పడాం గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు రహదారులను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్‌లు మత్స శ్రీదేవి, అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సత్యన్నారాయణ, పురుషోత్తం, నాయకులు చనమళ్ల వెంకటరమణ, మత్స సత్యన్నారాయణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు ముందుకురావాలి



చిన్నారులకు టీషర్టులు అందిస్తున్న దృశ్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకురావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ఎంఈవో పి.రామారావులు పిలుపునిచ్చారు. గరివిడి మండలంలోని శేరీపేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంటర్నేషనల్ యూత్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సమకూర్చిన టీషర్టులను వారి చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఆర్థికంగా బాగున్నవారంతా గ్రామ అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు చేసేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. డీకేఎస్ సంస్థ గ్రామంలో మధ్యతరహా పరిశ్రమను ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పయనిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు, సర్పంచ్ పిల్ల రామయ్యమ్మ, డీకేఎస్ సంస్థ ఫౌండర్ దబ్బాడ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ: మానవాళి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కొవ్వాడఅగ్రహారం ప్రాథమిక పాఠశాలలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం పెరిగిపోవడంతో వివిధ రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, సర్పంచ్ కోట్ల రామునాయుడు, ప్రజాప్రతినిధులు కర్రోతు బంగార్రాజు, మహంతి చిన్నంనాయుడు, భూర్లె శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పూసపాటిరేగ: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, భోగాపురం ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి, ఏసీడీపీఓ తవిటినాయుడు, సర్పంచ్ కోట్ల రామునాయుడు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి వనరులను సంరక్షించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: ప్రతీ నీటి బొట్టు చాలా విలువైనదని, పొదుపుగా వాడుకొని భావితరాలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ సూచించారు. మండలంలోని సారిపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు ప్రాణాధారమని, ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలన్నారు. జిల్లా ప్రజారోగ్యశాఖ ఈఈ దక్షిణామూర్తి మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి లీకులను గుర్తించి వెంటనే సరి చేయాలన్నారు. జిల్లా సూక్ష్మ నీటి వనరుల పథకం పీడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షం నీరు వృథా కాకుండా బిందు సేద్యం ద్వారా పెరటి మొక్కల పెంపకానికి ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఏపీఓ అరుణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాషా, కార్యదర్శి భవానీ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రజలంతా తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపంలో సోమవారం ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నాగమాధవి శిబిరాన్ని ప్రారంభించారు. కార్మికులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ఎంపీడీఓ జి.గిరిబాల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, కూటమి నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబల్ల అప్పలనాయుడు, జానా ప్రసాద్, పతివాడ గోవింద్, మజ్జి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..







నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు
- తొలిరోజు అండర్–14 విభాగంలో 6 క్రీడాంశాల్లో పోటీలు
- నేడు అండర్–17 విభాగంలో ఎంపికలు

విజయనగరం: పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఏటా స్కూల్ గేమ్స్ నిర్వహిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. నగర శివారులోని విజ్జీ స్టేడియం ప్రాంగణంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో మొత్తం 7 క్రీడాంశాల్లో బాలబాలికలకు మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు అండర్–14 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించగా.. నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇన్‌ఛార్జి కె.తౌడుబాబు తెలిపారు. మంగళవారం అండర్–17 విభాగంలో బాలబాలికలకు 6 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఈ నెల 25న అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్‌లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణంరాజు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి రాంబాబు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.